క్లుప్తంగా

మే డే ను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

బాన్సువాడ : మే డేను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు దుబాస్ రాములు అన్నారు. ఆదివారం బాన్సువాడలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మే 1న ఉన్నందున కార్మికులందరూ మే డేలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం నాయకులు శ్రీనివాస్, నల్ల గంగాధర్, పరమేష్, సాయిరాం, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో సప్తాహం



బాన్సువాడ రూరల్ : మండలంలోని హన్మాజీపేట్ గ్రామంలోని హనుమాన్ మందిరంలో సప్తాహం అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. శ్రీరుక్మిణీ విఠల్ వార్కారి భక్తులు గత నాలుగు రోజులుగా భజన సంకీర్తనలు ఆలపిస్తున్నారు. రాత్రి భజన కార్యక్రమానికి గ్రామస్తులు వందలాదిమంది భక్తులు హాజరవుతున్నట్లు భజనమండలి నిర్వాహకులు తెలిపారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

బాన్సువాడ రూరల్: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనరసింహ కల్యాణ మండపం (రెడ్డిసంఘం)లో సోమవారం మధ్యాహ్నం 3గంటలకు భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బాన్సువాడ తహసీల్దార్ వరప్రసాద్ తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనే ఈ సదస్సుకు మండలంలోని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కార్యకర్తల సమక్షంలో ఎన్నుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): ప్రతి ఒక్క బీజేపీ కార్యకర్త, నాయకుల సమక్షంలోనే మండల అధ్యక్షుడిని ఎన్నుకోవాలని కార్యకర్తలు కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులకు కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్లి మండల అధ్యక్ష పదవి ఎన్నిక చేపట్టాలన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి రాములుసేట్,మండలఇన్‌చార్జికృష్ణనువారు కోరారు.

రంజన్లకు పెరిగిన డిమాండ్



మద్నూర్(జుక్కల్): ఎండలు ముదరుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఉక్కపోతకు జనాలు అల్లాడిపోతున్నారు. వేడి తాపానికి ప్రజలు కూలర్లు, రంజన్ల వైపు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. మధ్య తరగతి ఉన్నత వర్గాల వారు ఫ్రిజ్‌ల కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు పేదలు రంజన్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా మద్నూర్ మట్టి కుండలకు డిమాండ్ పెరిగింది.

అధ్వానంగా చిట్యాల - వంకాయపల్లి రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చిట్యాల రోడ్డు నుంచి వంకాయపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వంకాయపల్లి గ్రామం నుంచి చిట్యాల గ్రామం, తాడ్వాయి మండల కేంద్రానికి రావాలంటే ఈరోడ్డు నుంచే రావాల్సి ఉంటుంది. వంకాయపల్లి నుంచి రాజంపేట్ మండలం ఆర్గొండ, అన్నారం, తాడ్వాయి మండలంలోని సంతాయిపేట్ మీదుగా 8కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి రావాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళలలో వెళ్లాలంటే వాహనదారులు భయపడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును బాగు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై కూరగాయల విక్రయాలు

- ఎల్లారెడ్డిలో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రోడ్డు మధ్యలో పండ్ల విక్రయాలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ఎల్లారెడ్డి గాంధీచౌక్‌లో రోడ్డుకు ఇరువైపులా కూరగాయలు, పండ్లు విక్రయిస్తున్న వ్యాపారులు, రైతులు

ఎల్లారెడ్డిరూరల్ : పట్టణంలోని గాంధీచౌక్ ప్రాంతంలో రోడ్డుకిరువైపులా కూరగాయలు, రోడ్డు మధ్యలో పండ్ల విక్రయాలతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో పండ్ల అమ్మకాలతో ఎదురుగా వాహనం వస్తే మరో వాహనం వెళ్లేందుకు ఇబ్బందులు అవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వారాంతపు సంతలో సరిపడా స్థలం ఉన్నప్పటికి అక్కడికి మార్కెట్‌ను తరలించకపోవడంతో రోడ్డుకు ఇరువైపుల ఇరుకు ప్రదేశంలో కూరగాయలను విక్రయించడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి ఖాళీ స్థలంలో కూరగాయలు, పండ్ల విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

కబ్జాకు గురవుతున్న నిజాంసాగర్ ఉపకాలువ



బాన్సువాడలో నిజాంసాగర్ ఉప కాలువను ఆనుకొని పాతిన ప్లాట్ల హద్దులు



ఉప కాలువ మరొక పక్కకు కబ్జా చేసేందుకు చదును చేసిన దృశ్యం

- బాన్సువాడలో హద్దులు పాతిన వైనం
- పట్టించుకోని అధికారులు

బాన్సువాడ : పట్టణంలో నిజాంసాగర్ ఉపకాలువ కబ్జాకు గురవుతోంది. పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీకి వెళ్లే దారిలో ప్రైవేటు భూమిలో వెంచర్ నిర్మించారు. ఈ వెంచర్ పక్క నుంచే నిజాంసాగర్ డి–10 ఉప కాలువ ద్వారా పంట పొలాల్లోకి సాగు నీరు వెళ్తుంది. ఉప కాలువకు ఇరు వైపుల సీసీ వాల్ నిర్మించారు. కాలువకు ఇరు వైపులా 9 ఫీట్ల మేరకు కట్ట ఉండేది. వెంచర్ నిర్వహకులు ఉప కాలువ సీసీ వాల్‌కు ఆనుకొని హద్దులు పాతి ప్లాట్లు చేశారు. మరొక పక్క కూడా కాలువకు అనుకుని హద్దులు పాతేందుకు చదును చేశారు. అలాగే కొయ్య గుట్ట సమీపంలో ఇదే ఉప కాలువను అనుకుని అక్రమార్కులు ప్లాట్లు చేశారు. నిజాంసాగర్ ఉప కాలువలు కబ్జాకు గురి కాకుండా చూడాల్సిన ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ గజానంద్‌ను వివరణ కోరగా సమస్య మా దృష్టికి వచ్చింది. కాలువకు ఇరుపక్కల 9 ఫీట్లు మేరకు స్థలం ఉండాలి. కాలువ పక్కన పాతిన హద్దులను తొలగిస్తాం.

కొవ్వొత్తులతో పహల్‌గాం అమరులకు నివాళి



కామారెడ్డిలో నివాళులు అర్పిస్తున్న ఆర్యసమాజం సభ్యులు



తాడ్వాయి మండలం ఎండ్రియాల్‌లో..

బీబీపేట/కామారెడ్డి అర్బన్/తాడ్వాయి: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్ గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన టూరిస్టులకు ఆదివారం పలు చోట్ల ఘనంగా నివాళులు అర్పించారు. బీబీపేటలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ప్రధాన వీధుల గుండా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. అలాగే తాడ్వాయి మండలం ఎండ్రియాల్‌లో గ్రామపెద్దలు, యువకులు ఆదివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పహల్గాం సంఘటన హిందువుల హృదయాలను కలిచివేసిందని, ఇలాంటి సంఘటనలు ముమ్ముందు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ఆర్యసమాజం సభ్యులు కోరారు. కామారెడ్డి ఆర్యసమాజం స్వర్ణోత్సవ సభలో మృతుల ఆత్మకు శాంతి కల్గాలని ఓం కారం జపించి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

పోచారం కాలువ మరమ్మతులకు ఏర్పాట్లు



ప్రధానకాలువ ప్రారంభంలో ధ్వంసమైన సైడ్‌వాల్



శిథిలావస్థకు చేరిన డి-1

- శిథిలావస్థకు చేరిన ప్రధానకాలువ సైడ్‌వాల్, డిస్ట్రిబ్యూటరీలు
- కొన్నింటికి నిధులు మంజూరు.. మరికొన్నింటి కోసం ప్రతిపాదనలు
- వానకాలం నాటికి పనులు పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించిన అధికారులు



ధ్వంసమైన డిస్ట్రిబ్యూటరీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల వరప్రదాయినిగా పేరొందిన మండలంలోని పోచారం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన కాలువకు మరమ్మత్తులు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇటీవలే యాసంగి పంటల సాగు పూర్తవడంతో ప్రాజెక్టు నుంచి ప్రధానకాలువలోకి నీటివిడుదలను నిలిపివేశారు. వానాకాలం ప్రారంభంనాటికి పోచారం ప్రధానకాలువకు అక్కడక్కడ శిథిలావస్థకు చేరిన సైడ్‌వాల్‌తోపాటు డిస్ట్రిబ్యూటరీలకు మరమ్మతులు చేపట్టేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

యూటీకి రూ.10లక్షలు మంజూరు..

మండలంలోని లింగంపల్లికలాన్ గ్రామసమీపంలో గల యూటీ(అండర్ టన్నెల్)కు మరమ్మతులు చేపట్టేందుకు సుమారు రూ.10 లక్షలు నిధులు మంజూరయ్యాయి. యూటీకి మరమ్మతులు చేయించేందుకు నెలరోజుల క్రితం టెండర్ ప్రక్రియ చేపట్టినా కాంట్రాక్టలెవరూ ముందుకు రాలేదని తెలిసింది. మరోమారు టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. దీంతోపాటు ప్రాజెక్టు వద్దనున్న గంగమ్మ గుడి వద్ద మెట్లనిర్మాణం చేపట్టేందుకుగానూ ఇటీవలే 11.65లక్షల నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ కింద ప్రధానకాలువకు సంబంధించి డిస్ట్రిబ్యూటరీ నం.1,5లు పూర్తిగా శిథిలమయ్యాయి. దీంతో పంటలసాగు కోసం ప్రాజెక్టు నుంచి విడుదల చేసిన సాగునీరు లీకేజీల ద్వారా, బుంగల ద్వారా వృథాగా పోతుంది. ఈ క్రమంలో డీ–1కు మరమ్మతులు చేపట్టేందుకు రూ.8.81లక్షలు, డీ–5కు రూ.9.95లక్షల నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయితే వెంటనే పనులు ప్రారంభంకానున్నాయి.

మరికొన్ని నిధుల కోసం ప్రతిపాదనలు..

మండలంలోని పోచారం ప్రధానకాలువకు సంబంధించి మరికొన్ని మరమ్మతు పనులు చేపట్టేందుకు అధికారులు ఇటీవల ప్రతిపాదనలు తయారుచేశారు. పోచారం ప్రధానకాలువ ప్రారంభంలో సైడ్‌వాల్ కొంతభాగం దెబ్బతింది. దీంతో మరమ్మతులు చేపట్టేందుకుగానూ 9.85 లక్షల మంజూరు కోసం రెండునెలల క్రితం ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపారు. . దీంతోపాటు మండలంలోని అచ్చాయపల్లి గ్రామసమీపంలో గల అక్విడెన్స్(న్యాలమోరి) మరమ్మత్తుల కోసం రూ.57లక్షలతో ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపారు. నిధులు మంజూరైన వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ఒక్కొక్కటిగా చేపడతాం

ప్రస్తుతం యాసంగి పంటలసాగు పూర్తయిన నేపథ్యంలో పోచారం ప్రాజెక్టు నుంచి నీటివిడుదలను నిలిపివేశాం. పోచారం ప్రధానకాలువకు సంబంధించి కొన్ని మరమ్మతులు చేపట్టేందుకు నిధులు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని మరమ్మతులకు అవసరమైన నిధుల కోసం ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపాం. నిధులు మంజూరైన వెంటనే టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపడతాం. – వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈఈ, ఎల్లారెడ్డి

మరమ్మతులకు నోచుకోని సింగిల్ ఫేజ్ మోటారు



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని దుర్కి గ్రామంలో గల ఇందిరమ్మ కాలనీలో సింగిల్ ఫేజ్ మోటారు మరమ్మతులకు నోచుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. బోరు మోటారు పని చేస్తుందని కాని కేవలం బటన్ మాత్రమే చెడిపోయిందని వారు తెలిపారు. నీరు తాగడానికి సైతం ఉపయోగ పడేవని, ఇప్పుడు నిరుపయోగంగా మారిందన్నారు. నీటి ప్రవాహనికి మార్గం లేక పక్కనే ఉన్న ఇంటి వారు అభ్యంతరం తెలుపుతున్నారు. నీటి ప్రవాహం వెళ్లుటకు మార్గం చూపి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రజతోత్సవ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



మాచారెడ్డిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తున్న నాయకులు



పోచారం వద్ద జెండాను ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్

సాక్షి నెట్ వర్క్, : వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో ఆదివారం జరగనున్న బీఆర్ఎస్ రజోత్సవ సభకు కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. అన్ని గ్రామాలు, మండల కేంద్రాల్లో పార్టీ అధ్యక్షులు గులాబీ జెండాలను ఎగురవేసి, ర్యాలీగా వెళ్లారు.నాగిరెడ్డిపేట మండలం పోచారం వద్ద మాజీఎమ్మెల్యే జాజాల సురేందర్ బీఆర్ఎస్ జెండాను ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు. కామారెడ్డిలో పార్టీ జెండాను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్ ఆవిష్కరించారు. మద్నూర్ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే పార్టీ జెండాను ర్యాలీని ప్రారంభించారు. బీబీపేట మండలం ఇస్సానగర్ గ్రామం నుండి బీబీపేట వరకు నాయకులు ఎడ్ల బండ్ల పై ర్యాలీగా వచ్చారు.



ఎల్లారెడ్డి నుంచి సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



బిచ్కుందలో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



కామారెడ్డిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్



భిక్కనూరులో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి వరంగల్ సభకు వెళ్తున్న నాయకులు



బాన్సువాడ నుంచి..



నస్రుల్లాబాద్ నుంచి ..



ఇస్సానగర్ నుంచి ఎడ్ల బండిపై బీబీపేట వరకు ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రశాంతంగా ముగిసిన 'మోడల్' ప్రవేశపరీక్ష



గోపాల్‌పేట పరీక్ష కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డిరూరల్/సదాశివనగర్/బాన్సువాడ రూరల్: జిల్లా వ్యాప్తంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. గోపాల్‌పేట మోడల్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 6వ తరగతిలో ప్రవేశానికి సంబంధించిన పరీక్షకు 131మంది విద్యార్థులు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు 7, 8, 9, 10 తరగతుల ప్రవేశానికి సంబంధించిన పరీక్షకు 67మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రాంప్రసాద్ తెలిపారు.ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 271 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ తోటగాంధీ తెలిపారు.

సదాశివనగర్ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 283 మంది విద్యార్థులు హాజరైనట్లు, మధ్యాహ్నం 7–10వ తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. బాన్సువాడ మండలం కొత్తాబాది మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో పూర్తి సీట్లతో పాటు 7, 8, 9, 10 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఆరో తరగతిలో మొత్తం 100సీట్లకు గానూ 269మంది, బ్యాక్‌లాగ్ సీట్లభర్తీకి 189మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రిన్సిపల్ కమలకిషోర్ తెలిపారు.



ఎల్లారెడ్డి మోడల్‌స్కూల్లో ప్రవేశ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

జోరుగా వరికోతలు



నాగిరెడ్డిపేట శివారులో రాత్రి వేళ వరిపంట కోత పనులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రస్తుతం యాసంగి సీజన్‌లో రైతులు సాగుచేస్తున్న వరిపంటలు కోతకు రావడంతో నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామాల్లో పంటకోత పనులు జోరుగా సాగుతున్నాయి. వరికోత యంత్రాలు అందుబాటులో లేకపోవడంతో ఉన్న వాటితో రాత్రింబవళ్లు పనులు చేపడుతున్నారు. పగటిపూట ఎండతాకిడి ఎక్కువగా ఉండడంతోపాటు రైతులు రాత్రిపూట చల్లని వాతవరణంలో పంటకోత పనులు చేపడుతున్నారు. దీంతో గ్రామాల శివారుల్లో రాత్రింబవళ్లు వరికోత యంత్రాలు మోత మోగుతున్నాయి.